

తాగునీటి భద్రతకు కూటమి చారిత్రాత్మక అడుగు

నేడు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పెరవలి రాక

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

ఉభయగోదావరి జిల్లాల ప్రజల తాగునీటి భద్రతకు టిడిపి కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక అడుగు వేసిందని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలియజేశారు. జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.3,050 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు పెరవలి మండలంలో శనివారం శంకుస్థాపన చేయడానికి సన్నాహాలు చేయడం అభినందనీయమని అన్నారు. ఈమేరకు శుక్రవారం ఎంఎల్‌ఎ రాధాకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచ్చేస్తుండటం శుభ పరిణామమని పేర్కొన్నారు.

'ఉపాధి' ఊపిరి తీసే..!

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసిన మోడీ సర్కార్

మహాత్మా గాంధీ పేరు తొలగింపు..

అసలు లక్ష్యానికి తూట్లు

రెండు జిల్లాల్లో 4.71 లక్షల ఉపాధి శ్రామికులపై ప్రభావం

ఏడాది పొడవునా ఉపాధి పనులకు తిలోదకాలు

డిమాండ్‌ను బట్టి పనికి రాంరాం.. అవసరాన్ని బట్టే పనులు

కేంద్రం ఇచ్చే 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గింపు

ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మోడీ సర్కార్ ఉపాధి హామీ చట్టం ఊపిరి తీసేసింది. మార్పుల పేరుతో ఉపాధి హామీ చట్టం లక్ష్యానికి పూర్తిగా తూట్లు పొడిచింది. దీంతో ఉపాధి శ్రామికులకు తీరని అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 4.71 లక్షల ఉపాధి శ్రామికులకు ఇక తీరని అన్యాయం జరిగే పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో 3.71 లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా, పశ్చిమలో 1,02,806 మొత్తం 4.71 లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. అత్యధిక మంది శ్రామికులకు ఉపాధి హామీ పనులే జీవనాధారం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలాఖారు వరకూ పరిశీలిస్తే ఏలూరు జిల్లాలో 90.66



లక్షల పని దినాలు కల్పించగా, పశ్చిమలో 37.72 లక్షల పని దినాలు కల్పించారు. వచ్చే మార్చి నాటికి మరిన్ని పని దినాలు శ్రామికులకు కల్పించనున్నారు. ఉపాధి పనులు ఎంతో మందికి ప్రాణవాయువులా మారాయి. ఇప్పుడు మోడీ సర్కార్ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా మార్చేయడంతో ఇక పనికి గ్యారెంటీ లేకుండా పోయింది. పేరు మార్పుతో పాటు ఉపాధి శ్రామికులకు ఉన్న ప్రయోజనాలన్నింటినీ ఛిధిమేసిన పరిస్థితి. 2005లో వామపక్షాల మద్దతుతో యుపిఎ-1లో ఈ చట్టం వచ్చింది. దీని వెనుక వామపక్షాల కృషి ఎనలేనిది. పేదలకు ఈచట్టం ఒక వరంలా పనిచేస్తోంది. 2014లో మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీయాలని కుయుక్తులు పన్నుతూ వచ్చింది. బడ్జెట్‌లో నిధులు తగ్గించడంతోపాటు, రకరకాల ఆంక్షలు పెడుతూ వచ్చింది. ఇప్పుడు చట్టంలో పేదల కోసం పొందుపర్చిన ముఖ్యమైన అంశాలను సైతం మార్చేసింది. మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును ఇప్పుడు 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవకా మిషన్ '(విబి జిఆర్ఎఎంజి)గా మార్చేసింది. ఇది ఒక రకంగా గాంధీ ఆనవాళ్లను చెరిపేసే కుట్రలో భాగంగానే జరిగిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాత చట్టానికి.. కొత్తగా చేసిన చట్టానికి తేడా ఇదే..

ఇప్పటి వరకూ చట్టంలో ఏడాదికి వంద రోజుల పని దినాలు కల్పించాలనే నిబంధన ఉంది. జనాన్ని మభ్యపెట్టేందుకు 125 పెంపు చేస్తున్నట్లు చూపి నిధులకు సంబంధించిన కోతలు పెట్టింది. పాత చట్టంలో డిమాండ్‌ను బట్టి నిధులు కేటాయించాలి. ఏడాది పొడవునా ఉపాధి పనులకు గ్యారెంటీ ఉంది. ప్రజలు డిమాండ్ చేసిన 15 రోజుల్లోగా పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. కూలీల వేతనాలు వంద శాతం కేంద్రమే భరిస్తోంది. 75 శాతం మెటీరియల్ ఖర్చు కేంద్రమే ఇవ్వాలి. కొత్తగా మార్పు చేసిన చట్టం అందుకు పూర్తి విరుద్ధంగా తయారైంది. డిమాండ్‌ను బట్టి పని కల్పన కాకుండా అవసరాన్ని బట్టి పనులు కల్పనగా మార్చేసింది. దీంతో శ్రామికులకు అవసరమైనప్పుడు కాకుండా వారికి ఇష్టమైనప్పుడు పనులు కల్పించే పరిస్థితి రానుంది. అంతేకాకుండా వ్యవసాయ సీజన్లలో 60 రోజుల పాటు ఉపాధి పనులు నిలిపేసేలా చట్టంలో మార్పు చేసింది. ఇప్పటివరకూ వ్యవసాయ సీజన్లలో అత్యధిక కూలి దక్కేది. ఇప్పుడు భూస్వాములు ఎంత కూలి ఇస్తే అంత కూలి తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్రం కేటాయించిన నిధులకంటే ఎక్కువ ఖర్చయితే రాష్ట్రాలే భరించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ ఉపాధి పనులకు సంబంధించి కేంద్రం 90 శాతం నిధులిస్తే రూ.పది శాతం రాష్ట్రాలు భరించేవి. ఇప్పుడు కేంద్రం నిధులు 60 శాతంగా, రాష్ట్రం 40 శాతం నిధులు భరించేలా చేసేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాష్ట్రాలు నిధులు కేటాయించకపోతే ఉపాధి పనులు లేకుండా పోతాయి. ఉపాధి హామీ చట్టంలో మోడీ సర్కార్ తెచ్చిన మార్పులు ఉపాధి శ్రామికులకు ఉరితాడుగా మారనున్నాయి. దీంతో మోడీ సర్కార్‌పై జనాల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. చట్టంలో చేసిన మార్పులను వెంటనే రద్దు చేయాలంటూ అంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. ప్రజలు రోడ్డెక్కేందుకు సిద్ధపడుతున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మోడీసర్కార్ ఈ చట్టాన్ని ఎన్నివిధాలుగా దెబ్బతీయాలో అన్ని ప్రయత్నాలు చేసింది. ఇప్పుడు పూర్తిగా దెబ్బతీసిన పరిస్థితి నెలకొంది.

పాత చట్టాన్ని అమలు చేయాలి

పి. రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

2005లో తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి. కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలి. రాష్ట్రాలపై భారం పెట్టకూడదు. ఆన్‌లైన్ ఇబ్బందులను తొలగించాలి. 197 జిఒ రద్దు చేయాలి. ఉపాధి హామీ శ్రామికులకు పని గ్యారెంటీ కల్పించాలి.

మన మిత్ర యాప్‌ను వినియోగించుకోవాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రభుత్వం అమలు చేసే సేవలన్నీ మనమిత్ర యాప్ ద్వారా మీ ఇంటి నుండే పొందవచ్చునని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి గ్రామస్తులతో అన్నారు. మనమిత్ర యాప్ వినియోగం పరిశీలనపై శుక్రవారం జెసి వీరవాసరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మనమిత్ర యాప్ ప్రజలు ఎవరెవరు వినియోగించుకుంటున్నారో, వాటిపై ఎంత మేరకు అవగాహన ఉందో జెసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు ఎవరెవరు వినియోగించుకుంటున్నారంటూ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కరెంటు బిల్లు నుండి గ్యాస్, వివిధ ధృవీకరణ పత్రాలతో రెండు వందల సేవలను మనమిత్ర యాప్‌తో పొందవచ్చునని జెసి అన్నారు. వీరవాసరం పంచాయతీ వారు సరఫరా చేస్తున్న తాగునీరు తాగేందుకు పనికి రావడం లేదంటూ స్థానికులు జెసి దృష్టికి తీసుకురావడంతో సర్పంచి చికలే మంగతాయారు స్పందించారు. ఒహెచ్ఆర్ వద్ద శుద్ధి చేసిన తాగునీరు, శుద్ధి చేయాల్సిన నీరు తీసుకొచ్చి జెసికి చూపించారు. తాము సరఫరా చేస్తున్న తాగునీరు తాగేందుకు పనికి వస్తాయంటూ ఇదే ఎదురుగానే సర్పంచి నీరు తాగి చూపించారు. పంచాయతీ నీరును పరిశీలించి తనకు రిపోర్టు పెట్టాలని కార్యదర్శి లక్ష్మిని ఆదేశించారు. ఇదివరంగా డ్రైయిన్ సదుపాయం లేదంటూ స్థానికులు జెసికి చెప్పడంతో గతంలో డ్రైయిన్ నిర్మాణానికి అభ్యంతరాలు చెప్పారని, ప్రస్తుతం డ్రైయిన్ ఏర్పాటుకు ఇప్పటికే రూ.ఐదు లక్షలతో పంచాయతీలో తీర్మానం చేశామని సర్పంచి తెలిపారు. ఆయన వెంట డిఎల్‌డిఒ దోసిరెడ్డి, ఎంపిడిఒ వైభవతి, తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి దుర్గాప్రసాద్ ఉన్నారు.

జెసి వీరవాసరం పర్యటనలో భాగంగా స్థానిక మద్దాల అనంతలక్ష్మి అనే మహిళ తన దీనస్థితిని జెసికి మొరపెట్టుకుంది. తన శరీరమంతా కణుతులు ఉండటంతో పని చేసుకోవడానికి ఆస్కారం లేకుండా పోతుందని, తనకు బిడ్డలు లేరని, తనకున్న వ్యాధి వికలాంగానికి వస్తుందో రాదో తెలియదని, తనను ఆదుకోవాలని కోరింది. దీంతో స్పందించిన జెసి ఆమె కోసం ప్రత్యేక వైద్యాధికారిని పంపి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైతే వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆమెకున్న వైద్యపరమైన ఇబ్బంది వికలాంగత్వంలోకి వస్తే పెన్షన్ వచ్చే ఏర్పాటు చేస్తానంటూ హామీ ఇచ్చారు.

వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లును రద్దు చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన బిల్లు ప్రతులు దహనం

ప్రజాశక్తి - ఉండి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు 2025ను వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కె.రోహిత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉండి మెయిన్ సెంటర్లో బిల్లు ప్రతులను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు దహనం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రోహిత్ మాట్లాడుతూ యూనియన్ క్యాబి నెట్ 'వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు 2025' ఆమోదాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. యుజిసి, ఏఐసిటిఇ, ఎన్‌సిటిఇ వంటి సంస్థల స్థానంలో హెచ్ఇసిఐ వంటి ఒకే నియంత్రణ సంస్థను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యారంగాన్ని కేంద్రీకరించడమే ఈ బిల్లు లక్ష్యం అన్నారు. ఎన్‌డిఎ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఆర్ఎస్ఎస్ మతపరమైన ప్రయోజనాల కోసం విద్యా రంగాన్ని నిరంతరం కేంద్రీకరించడానికి, వాణిజ్యీకరించడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఈ వికృత ఎజెండాను ఖరారు చేసే ప్రయత్నమే ఈ చర్య అన్నారు. ఈ బిల్లు ఆమోదం వల్ల భారత దేశంలోని ఉన్నత విద్యా సంస్థల నిధులు, పనితీరులో భారీ మార్పులు వస్తాయని, ఇది సామాన్య విద్యార్థులపై నేరుగా ప్రభావం చూపుతుందని తెలిపారు. యుజిసిని రద్దు చేయడం వల్ల వృత్తి విద్యా కోర్సులు లేని ఉన్నత విద్యా సంస్థల గొంతు నులిమినట్లవుతుందని తెలిపారు. రాష్ట్రాల్లోని విద్యా సంస్థలపై కేంద్రం తన భావజాలాన్ని రుద్దడానికి ఈ మార్పును ఒక సాధనంగా ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు. ఈ బిల్లు ప్రభావం నేరుగా వెనుకబడిన, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులు, కుటుంబాలపై పడుతుందన్నారు.



ప్రతులు దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఉపాధి హామీ చట్టం మార్పుపై నిరసన జ్వాలలు



భీమవరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ఉపాధి కూలీలకు నష్టం చేకూర్చితే ఊరుకోం : సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

చట్టంలో మార్పు అప్రజాస్వామికం : సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీసే విధంగా మార్పును వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు మిన్నంటాయి. కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి నిరసన దీక్ష ధర్నా చేపట్టారు. భీమవరం బాంబే స్వీట్ సెంటర్ సమీపంలోని గాంధీజీ విగ్రహానికి సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్, ఇతర నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ ఇప్పటివరకూ ఉన్న ఉపాధి హామీ చట్టం పేరు మార్చడమే కాకుండా చట్టం రూపు రేఖలను మార్చేసిందన్నారు. ఇప్పటివరకూ కేంద్రం చట్టంలో 90 శాతం ఖర్చు తానే భరించేది దాన్ని 60 శాతం కుదించి మిగిలిన 40 శాతం రాష్ట్రం భరించాలని తన బాధ్యత నుంచి తప్పించుకోవడం అంటే నీరు గార్చడమేనని సీతారాం అన్నారు. ఈ మార్పు వల్ల గ్రామాల్లో ఉపాధి ఉండదన్నారు. రాష్ట్రం ప్రజలకు వైసిపి, జనసేన, టిడిపి వేరు వేరు పార్టీలుగా కనిపించినా కేంద్రం తీసుకొచ్చే ప్రజా వ్యతిరేక మార్పులను మూడూ సమర్థిస్తున్నాయే తప్ప ఏ ఒక్కటీ వ్యతిరేకించడం లేదని, అది రాష్ట్ర ప్రజలు గమనించాలని తెలిపారు. జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలకు అన్నంపెట్టే ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు లేక ఇప్పటికే సంక్షేమ పథకాల్లో కోతలు పెడుతున్నాయన్నారు. దేశ స్వాతంత్రోద్యంలో తన జీవితాన్ని త్యాగం చేసిన జాతిపిత గాంధీ పేరును ఉపాధి హామీ చట్టానికి తీసేయడం అంటే మరో సారి బిజెపి గాంధీని చంపడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు ధనికొండ శ్రీనివాస్, గొర్ల రామకృష్ణ, ఇంజేటి శ్రీనివాస్, శేషపు అశ్రియ్య, పట్టణ కమిటీ నాయకులు ఎం.వైకుంఠరావు, మల్లిపూడి ఆంజనేయులు, దేగల నాగు, కృష్ణ, త్రిమూర్తులు, కార్మికులు పాల్గొన్నారు.

వ్యకాస ఆధ్వర్యాన..

ఉపాధి హామీ చట్టం స్థానంలో విబి జీ రామ్ జీ చట్టం తేవడం కూలీల ఉపాధి లేకుండా చేయడమేనని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. ఉపాధి గ్యారెంటీ లేకుండా చేసే 197 బిల్లుకు నిరసనగా స్థానిక పాత బస్టాండ్ బాంబే స్వీట్ సెంటర్లోని గాంధీ విగ్రహం వద్ద ఉపాధి కూలీలు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గొర్ల రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు అశ్రియ్య మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి అమల్లో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని ఇప్పుడు ఎందుకు మార్చాల్సి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా 2005 చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలని, 197 బిల్లును వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ఉపాధి కూలీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. వీరమల్లు భవాని, పూరెల్ల లక్ష్మి, పడమటి కోటేశ్వరమ్మ, వాకల కుమారి, వీరేంద్ర మార్తా పి.నతానియల్, బుగ్గ జ్యోతి పాల్గొన్నారు.



ఆచంట : ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు



తణుకు : ఆందోళన చేస్తున్న నేతలు

తణుకు : ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నాశనం చేసే చర్యలను ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయ కుమారి అన్నారు. స్థానిక బ్యాంక్ కాలనీ వద్ద ఉన్న గాంధీ, స్వాతంత్ర సమరయోధులు విగ్రహాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్, అజయకుమారి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి గాంధీజీ పేరు ఉండడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. కేంద్రం పెట్టిన ఈ బిల్లును టిడిపి, జనసేన, వైసిపి వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుబ్బల గోపి, గార రంగారావు, ఎం.గంగాధర్‌రెడ్డి, కె.నాగరత్నం, సింగులూరి సత్యనారాయణ, పి.ఉష, ఉమాదేవి, యోగేశ్వరి, లీలా మహేశ్వరీ, గీత, సునీత, పుణ్యవతి, శ్రీదుర్గ పాల్గొన్నారు.

ఆచంట : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త బిల్లు చట్టమైతే ఉపాధి హామీ చట్టం తలలేని మొండంగా మారుతుందని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఆచంటలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలోని హామీ అనే పదాన్ని తొలగించడం ద్వారా చట్టం నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చట్టాన్ని నీరు గార్చేందుకు కుట్ర పన్నుతోందని, దీన్ని ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు తిప్పి కొట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. సిపిఎం నాయకులు తోటపల్లి సత్యనారాయణ, బండి రంగారావు, కొండేటి సత్యనారాయణ, మానేపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం

సిఐటియు జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై రాబోయే రోజుల్లో పెద్దఎత్తున పోరాటాలు చేయాలని, దీనికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకులు సన్నద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సిఐటియు అఖిలభారత మహాసభలు డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సందర్భంగా తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యాన స్థానిక సీతారామ పేటలో శ్రామిక్ ఉత్సవ్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాల కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ 11 ఏళ్ల మోడీ పాలనంతా దాచుకో.. దోచుకో అన్నట్లుగానే సాగిందని విమర్శించారు. కార్మికుల హక్కుల రక్షణకు పోరాటాలే మార్గమని, సిఐటియు అఖిల భారత మహాసభలో వీటిపై ప్రధానంగా చర్చిస్తారని, ఈ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కరెడ్ల రామకృష్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిఐటియు పట్టణ కన్వీనర్ జవ్వాది శ్రీను, పుట్టా వేణుగోపాల్ చౌదరి, శిద్దిరెడ్డి శేషుబాబు, చిర్ల పుల్లారెడ్డి, పోతు శ్రీను, సత్తికోదండ రామిరెడ్డి పాల్గొన్నారు.



పెనుమంట్ర : మార్టేరు ఫారంలో జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం(అగ్రికల్చర్ ఫారం)లో శుక్రవారం సిఐటియు ఆల్ ఇండియా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కార్మికుల మధ్య జెండా ఆవిష్కరించారు. సిఐటియు మండల కన్వీనర్ నేతల చిత్తరంజన్, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కేతా గోపాలన్, బల్ల చిన వీరభద్రం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించమంటే లాఠీఛార్జి చేస్తారా..

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు



భీమవరం : ధర్నా చేస్తున్న కార్మికులు, నేతల

ప్రజాశక్తి - భీమవరం

సమస్యలు పరిష్కారమడిగితే లాఠీ ఛార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు విమర్శించారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ చేస్తున్న ధర్నాపై పోలీసుల అక్రమ లాఠీఛార్జ్ చేయడాన్ని సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక భీమవరం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సిఐటియు ఆధ్వర్యాన నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఉద్యమాలపై గత ప్రభుత్వం ఉపయోగించిన నిర్బంధమే నేటి ప్రభుత్వం కొనసాగిస్తుందని విమర్శించారు. సమ్మె కాలానికి జీతాలు అడగటం తప్పా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పిన కూటమి ప్రభుత్వం ఎందుకు అమలు చేయట్లేదన్నారు. భీమవరం మున్సిపాలిటీలో చెత్త పెరిగి పని భారం పెరిగిందని, కార్మికుల సంఖ్య పెరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశుధ్యం మెరుగుపడాలంటే 500 మంది కార్మికులు అవసరమని కేవలం 350 మందితో పని చేస్తున్నారని అందులో సగం అధికారుల, ప్రజాప్రతినిధుల ఇళ్లల్లో పనిచేయడానికి పరిమితం అవుతున్నారని తెలిపారు. వెంటనే డిప్యూటేషన్ రద్దుచేసి కార్మికులందరినీ పారిశుధ్య పనిలో పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు నీలాపు బంగారు వరలక్ష్మి, బొత్స మోషే, డి.నాగేశ్వరరావు, ఎం.వైకుంఠరావు, డి.త్రిమూర్తులు, ధనాల చిన్న పెద్దిరాజు, సిహెచ్.వెంకటేశ్వరరావు, కె.కృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : నెల్లూరులో గురువారం జరిగిన మున్సిపల్ కార్మికులపై లాఠీ ఛార్జిని నిరసిస్తూ శుక్రవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యాన తాడేపల్లిగూడెం పురపాలక సంఘం వద్ద నిరసన చేపట్టారు. సిఐటియు మున్సిపల్ వర్కర్స్ పర్మినెంట్ అండ్ ఆప్కోస్ సానిటరీ వర్కర్స్, డ్రైవర్స్, వాటర్ వర్క్స్, అంగన్వాడీ స్కూల్ స్వీపర్స్, లైటింగ్ సెక్షన్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం నుండి కెఎన్ రోడ్ మీదుగా పోలీస్ స్టేషన్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనా వెంకట్రావు, మున్సిపల్ వర్కర్స్ లీగల్ అడ్వైజర్ దాసరి నరసింహారావు, మున్సిపల్ వర్కర్స్ అధ్యక్షులు తాడికొండ జయరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొడమంచిలి బాబు, సతీష్ కుమార్, ధనాల రాజు పాల్గొన్నారు.

భీమవరం మున్సిపాల్టీకి స్టేట్ ఎనర్జీ కన్సర్వేన్సీ అవార్డు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్సర్వేన్సీ అవార్డు(ఎస్ఇసిఎ) 2025 ప్రభుత్వం వారు రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో సర్వే చేసి మున్సిపల్ కార్పొరేషన్ తరపున భీమవరం మున్సిపాలిటీకి సిల్వర్ అవార్డు ప్రకటించారు. శుక్రవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.సంపత్ కుమార్, రీజినల్ డైరెక్టర్ కం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సిహెచ్.నాగ నరసింహారావు అవార్డు వచ్చిన మున్సిపల్ కమిషనర్లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ అవార్డుకు విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించిన 123 మున్సిపాలిటీల్లో కరెంట్ బిల్లులు 2022 నుంచి 2025 వరకు వాడిన యూనిట్లను స్టేట్ ఎనర్జీ డిపార్ట్మెంట్ వారు సర్వే చేసి ఎ హెడ్ వాటర్ వర్క్స్ హెచ్‌టి సప్లై, బి స్ట్రీట్ లైట్స్ ఎలక్ట్రికల్ సప్లై, సి బిల్డింగ్స్‌కు ఎల్‌టి లైన్‌లను సర్వే చేసి అవార్డు ప్రకటించారు. విద్యుత్ వినియోగంలో అనేక సంస్కరణలు చేపట్టి విద్యుత్‌ను ఆదా చేయడం వల్ల ఈ అవార్డు పొందటం జరిగిందని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం విజయవాడలో ప్రభుత్వం నుండి భీమవరం మున్సిపాలిటీ తరపున మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ పి.త్రినాధ రావు అవార్డు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది అందరూ కమిషనర్‌కి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సుపరిపాలన పద్ధతులపై జిల్లా స్థాయి వర్క్‌షాప్‌లు

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం



సంపరిపాలన వారోత్సవాల్లో భాగంగా పరిపాలన గ్రామాల వైపు (సుశాసన్ సప్తాహ్ ప్రశాసన్ గావ్ కీ ఒరే) దేశవ్యాప్త ప్రచార ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి వర్చువల్‌గా తిలకించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జిల్లాల్లో ఈ కార్యక్రమం ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఈ ప్రచార కార్యక్రమం ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇది ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడానికి, సేవలు మెరుగుపర్చడానికి దేశవ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమం అన్నారు. పరిపాలనను గ్రామస్థాయికి చేర్చడం దీని లక్ష్యం అన్నారు. దీనిలో అధికారులు గ్రామాలకు వెళ్లి సేవలు అందిస్తారన్నారు. ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను మెరుగ్గా, సులభంగా అందించడం జరుగుతుందన్నారు. 'పరిపాలన గ్రామాలకు వెళ్తుంది' అనే నినాదంతో ప్రభుత్వ అధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని, పరిష్కారాలు చూపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన వివిధ శాఖలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. సుపరిపాలన పద్ధతులపై జిల్లా స్థాయి వర్క్‌షాప్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి : విప్

ప్రజాశక్తి - మొగల్తూరు



ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఎంఎల్ఎ

విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా రాణించడం శుభ పరిణామమని విప్ నాయకర్ అన్నారు. జిల్లా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో మండలంలోని కేపీ పాలెం లో ఉన్న జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని తంగెళ్ళ సుమ ప్రథమ స్థానంలో నిలిచింది. నాయకర్ చేతుల మీదుగా సుమకు రూ.3 వేల నగదు ప్రోత్సాహక బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందన్నారు. విద్యార్థులు బాగా చదివి తమ ఊరికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పితాని ఇందిర, చింతపల్లి కృష్ణమోహన్, పాఠశాల సిబ్బంది, పలువురు గ్రామస్తులు సుమను అభినందించారు.

కండక్టర్ విజయలక్ష్మి నిజాయతీ

ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సు అందజేత

భీమవరం టౌన్: తాడేపల్లిగూడెం(గగనప్రియ) సర్వీసు బస్‌లో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు పోగొట్టుకున్న మనీ పర్స్ సర్వీసు కండక్టర్ కె.విజయలక్ష్మి ఇ.701306 దొరికితే సంబంధించిన ప్రయాణికుడికి తెలియపరిచి డిపో మేనేజర్ వై.వేణు సమక్షంలో నగదుతో ఉన్న పర్సు సదరు ప్రయాణికుడికి ఎస్‌ఎం సెక్షన్ వద్ద అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్‌టిసిలో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు తమ సిబ్బంది నిజాయితీగా ఉంటూ ప్రయాణికులు పోగొట్టుకునే సామాన్లు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. కండక్టర్ విజయలక్ష్మి బాధ్యతగా ప్రయాణికుడికి పర్సు అందించడం అభినందనీయమన్నారు.

రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ లీగ్ బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం టౌన్: భీమవరం గన్నాబత్తుల వారి క్రీడా మైదానంలో 8 రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ లీగ్(పిసిఎల్-3) బ్రోచర్‌ను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆవిష్కరించారు. శుక్రవారం ఎంఎల్‌ఎ కార్యాలయంలో ఆర్గనైజర్ సభ్యులు ఎంఎల్‌ఎ అంజిబాబును కలిసి క్రికెట్ లీగ్ వివరాలను తెలియజేశారు. ఈనెల 21 నుండి 28వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ లీగ్(పిసిఎల్-3) పోటీలను 3వ సారి భీమవరంలో నిర్వహించడం గొప్ప విశేషమని, ఆంధ్ర టీమ్‌తోపాటు తెలంగాణ, తమిళనాడు నుంచి కూడా టీమ్‌లు వస్తున్నాయన్నారు. ఆర్గనైజర్ బ్రహ్మశ్రీయుల సుబ్రహ్మణ్య శర్మ, బ్రహ్మశ్రీయుల ప్రసాద్ శర్మ, చందూరి కామేశ్వరరావు శర్మ మాట్లాడుతూ ప్రతి ఏడాది రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ లీగ్ పోటీలు జరుగుతున్నాయని, 2018, 2021లో భీమవరంలో ఈ క్రికెట్ లీగ్ జరిగిందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కలిదిండి సంతోష్ కుమార్ శర్మ వెంకటేశ్వర ప్రసాద్ ట్రస్ట్ సభ్యులు వేలూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి ఏడాది 16 జట్లు పాల్గొనేవని, ఈ ఏడాది 20 టీమ్‌లు పాల్గొంటున్నాయన్నారు. ఈ ఏడాది ఆంధ్రా, తెలంగాణలతోపాటు తమిళనాడు నుంచి కూడా టీమ్ పాల్గొంటున్నాయన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఫ్రీజర్లు

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాద ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రెండు ఫ్రీజర్లు కొనుగోలు చేశారు. ఇప్పటికే ఆస్పత్రిలో రెండు ఫ్రీజర్లు ఉన్నాయి. అయితే అత్యవసర సమయాల్లో మృతదేహాలను భద్రపరుచుకునేందుకు అదనంగా ఫ్రీజర్లు లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. ఆస్పత్రి తనిఖీలకు విచ్చేసిన ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌కు వైద్యులతో పాటు ప్రజలు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ప్రభుత్వం రూ.1.80 లక్షలతో రెండు ఫ్రీజర్లను తమిళనాడు కోయంబత్తూరు నుంచి కొనుగోలు చేసింది. వీటిని త్వరలో వినియోగంలోకి తీసుకొస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సంతోష్ కుమార్ తెలిపారు.

బాలాద్రి కుటుంబానికి పలువురు పరామర్శ

పెనుమంట్ర : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని భట్లమగుటూరు గ్రామానికి చెందిన స్థానిక వైద్యులు(ఆర్ఎంపి) కుక్కల బాలాద్రి(70) కుటుంబాన్ని పలువురు రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు జర్నలిస్ట్ యూనియన్ నాయకులు, అధికారులు, ఫోటోగ్రాఫర్లు పరామర్శించారు. మృతుడు బాలాద్రి కుటుంబ సభ్యులను ... ఆయన పెద్ద కుమారుడు కుక్కల రవి కుమార్ వీడియో, ఫొటో గ్రాఫర్‌గా, స్థానిక సూర్య పత్రిక విలేకరిగా పనిచేస్తూ మంచి పేరుపొందారు. ఈ సందర్భంగా అందరూ ఆయన మృతికి సంతాపం తెలిపి, వారి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ... సచివాలయ సిబ్బంది గురు ప్రసాద్, చవ్వాకుల భరత్‌కుమార్, దొంగ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వేగవంతంగా ఆర్‌ఒబి నిర్మాణ పనులు

ఉండి: ఉండి రైల్వే గేట్‌పైన నిర్మిస్తున్న ఆర్‌ఒబి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రైల్వే ట్రాక్ పక్కన పిల్లర్ నిర్మించేందుకు డిసెంబర్ ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు రైల్వే గేటును మూసివేసి పనులు నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లర్ నిర్మాణానికి రైల్వే ట్రాక్ పక్కన జాతీయ రహదారిని తవ్వడంతో దానిని బలోపేతం చేసేందుకు పిల్లర్లకు రహదారికి మధ్యలో ఐరన్ రాడ్ పెట్టి రహదారిని పూడ్చుతున్నారు. ట్రెయిన్ వెళ్లే చోట పిల్లర్లకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు తవ్విన భాగంలో ఐరన్ రాడ్ పెట్టి ఏర్పాటు చేస్తున్నారు. ఇవి ఆర్‌ఒబి ప్రతినిధులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 20వ తేదీ శనివారం సాయంత్రానికి రైల్వే గేటును తెరిచేందుకు పనులను వేగవంతం చేశామని వారు వివరించారు.

కాలువ గట్టు ప్రక్షాళనకు చర్యలు

మొగల్తూరు : మొగల్తూరులోని సాగునీటి కాలువ గట్టు ప్రక్షాళనకు అధికారులు చర్యలు చేపట్టారు. మొగల్తూరులోని ... పెద్ద కాలువ పంచాయతీ పరిధిలోని కాలువ గట్టును శుక్రవారం అధికారులు పరిశీలించారు. గట్టుపై పెద్ద నిర్మాణం చేసుకున్న వారితో మాట్లాడారు. గతంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు చేసిన సర్వే ఆధారంగా ఇళ్లు నిర్మించుకున్న వారిని తొలగించాలని సూచించారు. పంట కాలువ ప్రక్షాళన సమస్యను ఆ శాఖ అధికారులకు తెలుపుతామని తహశీల్దార్ కె.రా కిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి అన్నారు.

తోలేరు వంతెన నిర్మాణానికి నిధులు : ఎంపిపి

వీరవాసరం : వీరవాసరం నుండి తోలేరు గ్రామ వెళ్లే మార్గంలో ఉన్న పొలమూరు మురుగు కాలువపై శిథిలావస్థలో ఉన్న వంతెన పునర్నిర్మాణానికి రూ.3.13 కోట్లు మంజూరైనట్లు ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. మండలం నుండి పాలకోడేరు మండలం వెళ్లాలంటే ఈ వంతెనే కీలకం. ఈ వంతెన సమీపంలో మురుగు కాలువ గట్టు తరచూ కుంగిపోతుంది. దీంతో రైతులు తమ పంటను వాహనాల్లో తీసుకెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్ తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయించినట్లు ఎంపిపి తెలిపారు. ఈ నిధులతో వంతెనతో పాటు కాలువ గట్టు కుంగిపోకుండా రక్షణ గోడ కూడా నిర్మిస్తారని ఎంపిపి తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, తోలేరు ఉపసర్పంచ్ భోగిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ పవర్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రామాభివృద్ధికి చెందిన స్వర్ణాంధ్రలో గ్రామాలు ఎదిగిన నాడే రాష్ట్ర అభివృద్ధి, దేశాభివృద్ధి రూపొందుతుందని విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు మండలం కె.పెంటపాడు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ పవర్ స్టేషన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమే ధ్యేయంగా గ్రామాల్లో వెలుతురు నింపేందుకు డబల్ ఇంజన్ సర్కార్ పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో గ్రామాల్లో వెలుతురు నింపేందుకు నడుం బిగించారని తెలిపారు. వీరికి తోడుగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ నిలిచారని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ట్రిపుల్ ఫేజ్ కరెంట్ ను అందుబాటులోకి తీసుకు వచ్చామని, అతి త్వరలో గ్రామాలు పూర్తిస్థాయిలో నిలుస్తాయని అన్నారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా జలజీవన్ మిషన్ పథకం రూపొందించామని, ఈ పథకం ద్వారా కె.పెంటపాడు రక్షిత మంచినీటి పథకాన్ని పూర్తి చేస్తామని ఎంఎల్‌ఎ అన్నారు. పెంటపాడు గ్రామంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఆధ్వర్యాన నిర్మించిన సీసీ డ్రెయిన్‌లను శుక్రవారం ప్రారంభించారు.

రక్తదానానికి ముందుకు రావాలి

ఆర్‌డిఒ దాసిరాజు

నరసాపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతీఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆర్‌డిఒ దాసిరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సబ్ డివిజన్‌లోని రెవెన్యూ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దాసిరాజు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ప్రతి మూడు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయడం మంచిదన్నారు. రక్తదానం చేయడంపై అపోహలు విడనాడాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ, ఆర్ఐ సురేఖ పాల్గొన్నారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు సిఎస్ఎన్ విద్యార్థులు

భీమవరం : జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ నెట్ బాల్ పోటీలకు భీమవరం డాక్టర్ సిఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రం మంగళూరులో జరగనున్న 69వ జాతీయస్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ నెట్ బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు కళాశాల విద్యార్థిని ఎం.బేబీ రాణి(ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి) బాలికల విభాగంలో, కె.హనూక్(సిఇసి ఇంటర్ ద్వితీయ సంవత్సరం) రాణించి ప్రాతినిధ్యం వహిస్తున్నారని ప్రిన్సిపల్ ఎమ్‌డి సలీం ఖాన్ తెలిపారు. ఈనెల 24వ తేదీ నుండి 29వ తేదీ వరకు నెట్ బాల్ అండర్-19 ఎస్‌జిఎఫ్ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టు నుండి ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ ఇద్దరు క్రీడాకారులను డాక్టర్ సిఎస్ఎన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ చీడే సత్యనారాయణ మెడల్స్ అందించి అభినందించారు. ప్రతి స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22వ తేదీ ఆంధ్రప్రదేశ్ మంగుళూరుకి బయలుదేరనున్నారని పిడి కోచ్ దావూద్ ఖాన్ తెలిపారు. భీమవరం డాక్టర్ సిఎస్ఎన్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, ట్రెజరర్ వడుపు గోపి, కళాశాల ప్రిన్సిపల్ ఎమ్‌డి. సలీం ఖాన్, పిడి దావూద్ ఖాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళల త్రో బాల్ ఫైనల్స్‌లో ద్వితీయ స్థానం

పెనుమంట్ర : నరసాపురం డివిజన్ ఉపాధ్యాయ క్రీడల్లో భాగంగా మండలం లోని మార్టేరు ఎస్‌విజి జెడ్‌పి హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన మహిళల త్రో బాల్ ఫైనల్స్‌లో యలమంచిలి మండలం త్రో బాల్ మహిళా జట్టు ప్రథమ స్థానం సాధించింది. కాగా స్థానిక పెనుమంట్ర మండలం మహిళా జట్టు ద్వితీయ స్థానం సాధించడం విశేషం. ఈ పోటీలను కాకినాడ ఆర్‌ఐపిఇ బి.జాన్సన్, మండల కోఆర్డినేటర్ పడాల శ్రీనివాసరెడ్డి, డివిజనల్ కోఆర్డినేటర్ ఆర్.రామకృష్ణ, స్థానిక హై స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు కట్టా మధుసూదనరావు, ఎల్.నగేష్, పిడిలు జిఎస్ఎస్.ప్రసాద రెడ్డి, ఎ.అంజమ్మ, శ్రావణి, మధుర వల్లి, బివి.సత్యనారాయణ, కెనడి పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విజేతలను స్థానిక ఎంఇఒలు యండమూరి లక్ష్మీనారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు, మండలంలోని అధికారులు అభినందించారు.

ప్రయాణికులకు ఆర్‌టిసి చేదువార్త

విలేకరుల సమావేశంలో ఆర్‌ఎంఎన్‌వి.వరప్రసాద్

భీమవరం టౌన్ : సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుండి వచ్చే ప్రయాణికులకు పశ్చిమగోదావరి జిల్లా ఆర్‌టిసి ఆర్‌ఎం వరప్రసాద్, చేదువార్త చెప్పారు. ఈసారి సంక్రాంతికి కేవలం జిల్లా నుండి విజయవాడ, విశాఖపట్నం వైపు మాత్రమే సర్వీసులను అదనంగా పెంచడం జరుగుతుందన్నారు. ఆర్‌టిసి కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. గోదావరి జిల్లాలకు చెందిన ఎన్నో కుటుంబాలు చెందినవారు జీవనోపాధి కోసం హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. తెలుగువారి ముఖ్యంగా గోదావరి జిల్లాలకు అతి పెద్ద పండుగైన సంక్రాంతికి కుటుంబ సమేతంగా సొంత ఊరికి తరలిరావడం అందరికీ తెలిసిందే. ఆర్‌టిసి వీలైనంత ఎక్కువ సర్వీసులు హైదరాబాద్ నుండి నడపకపోతే ప్రయాణికులు పెద్ద మొత్తంలో రాకపోకలకు జేబులు ఖాళీ చేసుకోవాలని పరిస్థితి వస్తుంది. ఇది సీజన్ కావడంతో ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ వారు అయిన కాడికి దోచుకోవటం మనం ప్రతి సంక్రాంతిలో చూస్తున్నాం.. ప్రభుత్వం దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ సర్వీసులు నడపవలసి ఉంది.

అందుబాటులో యూరియా

వ్యవసాయాధికారిణి బి.దేవీ స్వరూప

పెనుమంట్ర : మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ)లో యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ అధికారిణి బి.దేవీ స్వరూప శుక్రవారం ఇక్కడ తెలిపారు. ఈ మేరకు సోమరాజు ఇల్లింద్రపర్రు సొసైటీలో 22 మెట్రిక్ టన్నులు, జుత్తిగ సొసైటీలో 23 టన్నులు, పాలమూరు సొసైటీలో 15 టన్నులు, మాముడూరు సొసైటీలో 12.6 టన్నులు, అందుబాటులో ఉందని ఆమె పేర్కొన్నారు. ఖరీఫ్ 2025 సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 4,328 రైతులకు గాను 24 వేల 310 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని ఆమె అన్నారు. ఇంకా రాశుల మీద ఉన్నటువంటి రైతులందరికీ గోనె సంచులు అన్నీ కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ధాన్యాన్ని పట్టుబడి పట్టి, రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని తెలిపారు.

ప్రమాదాలు నివారించాలి : సిపిఎం

పెనుమంట్ర : మండలంలోని నిరంతరం ట్రాఫిక్ రద్దీ ఉండే మార్టేరు సెంటర్ నాలుగు రోడ్ల జంక్షన్లో పోలీస్ అవుట్ పోస్ట్‌తో పాటు, స్టేషన్ కానిస్టేబుల్ని ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని సిపిఎం మార్టేరు శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం మార్టేరు సెంటర్లో సిపిఎం ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, ఆచంట, పెనుగొండ వైపు నుండి వస్తున్న వాహనాల రద్దీ కారణంగా ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. శాశ్వత డిజిటల్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలు నిర్వహించవచ్చని తెలిపారు. తక్షణం ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు నేతల చిత్తరంజన్, కె.సుబ్బరాజు, హనుమంతు, పెనుగొండ మండల నాయకులు ఎస్‌కె.పాదుషా, పోడూరు మండల నాయకులు పిల్లి ప్రసాద్, బళ్ల చిన్న వీరభద్రం, జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పక్కా రోడ్డు వేయాలి

సిపిఎం ఆధ్వర్యాన విప్, ఎంఎల్ఎ నాయకర్‌కి వినతి

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో పాడైపోయిన రోడ్డు స్థానంలో పక్కా రోడ్డు వేయాలని విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌కి సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఎంఎల్ఎ నాయకర్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బూడిద జోగేశ్వరరావు మాట్లాడుతూ పంజా సెంటర్ నుండి మంగినవారు నగర్ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా పాడైపోయి గుంతల పడిపోయిందన్నారు. వాహనదారులకు స్కూల్‌కి వెళ్లి వచ్చే పిల్లలకు, పెద్ద వయసు వారికి చాలా ఇబ్బందిగా ఉందన్నారు. ఈ రోడ్డు ఆనుకుని వివిధ విద్యాసంస్థలు, గవర్నమెంట్ హాస్పిటల్ వెళ్లేవారు ఈ మార్గంలో వెళ్తారన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల రోడ్డు మార్గం పూర్తిగా పాడైపోయి శిథిలావస్థకు చేరుకుందన్నారు. వెంటనే చొరవ చూపి పట్టణంలో పాడైపోయిన రోడ్డు స్థానంలో పక్కా రోడ్డు వేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నోములకొండ, పొన్నాడ మల్లేష్, పాలపర్తి లక్ష్మీనారాయణ, పొగిరి సోమేశ్వరరావు పాల్గొన్నారు.


వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన నిత్యావసరాల పంపిణీ

పాలకొల్లు : వాకర్స్ క్లబ్ పాలకొల్లు తరపున పాలకొల్లు పట్టణంలోని 15, 16వ వార్డుకు చెందిన ఏఆసరా లేని పేద కుటుంబాలకు రూ.13 వేల విలువైన నిత్యావసర వస్తువులను అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు సభ్యులతో కలిసి గురువారం అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, జంపన నాగేంద్ర ప్రసాద్, మానెం ధనుంజయ శ్రీనివాస్, అంబటి సాయి, జంధ్యం నరసింహారావు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలు అభినందనీయం

సుకన్య సమృద్ధి యోజన కార్డుల పంపిణీలో ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్



కార్డులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ

రాజకీయ నాయకుల పుట్టినరోజు నాడు ప్రజల కోసం సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎంఎల్ఎ, పిఎసి కమిటీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శుక్రవారం జనసేన భీమవరం పట్టణ అధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎపిఐఐసి డైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్ పుట్టినరోజు సందర్భంగా పది సంవత్సరాల లోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి స్కీంలో భాగంగా 200 మంది ఆడపిల్లలకు అకౌంట్స్‌ను ఎంఎల్ఎ చేతుల మీదుగా పెద్ద పోస్ట్ ఆఫీస్‌లో ఆడపిల్లల తల్లులకు అందజేశారు. అనంతరం ఎంఎల్ఎ జనసేన నాయకులు, జన సైనికులు, వీర మహిళలు అందరితో కలిసి కేక్ కట్ చేసి చంద్రశేఖర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, పత్తి హరివర్ధన్, బన్ను ప్రసాద్, మోకా శ్రీను, దారపురెడ్డి త్రివిక్రమ్, సతివాడ నవీన్, కొట్టు సురేష్, పుప్పాల వెంకట సుబ్బారావు, గుసిడి బాలమురళీకృష్ణ(సూరిబాబు), పాపోలు ఆంజనేయులు, రామాయణం శ్రీనివాస్, జూలూరి వెంకటేష్, కాలేజ్ శేఖర్, మేడిశెట్టి లవరాజ్, గంటా శేషు, చెన్ను రవి, జడ్డు బాబి, పిసిని సంతోష్, ఒడిసి మీనాక్షి, చిన్నమిల్లి శ్రీవల్లి, సూరిశెట్టి కల్పన పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి డిప్యూటీ స్పీకర్ కృషి

జెడ్‌పిటిసి లక్ష్మీ తులసి, ఎంపిపి చంటి రాజు



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి, ఎంపిపి

పాలకోడేరు : నియోజకవర్గంలో గ్రామాలాభివృద్ధికి డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు చేస్తున్న కృషి అభినందనీయమని పాలకోడేరు జెడ్‌పిటిసి పెద్దిశెట్టి లక్ష్మీతులసి, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు(చంటి రాజు) అన్నారు. కొండేపూడి శివారులో మండల పరిషత్, జెడ్‌పి నిధులతో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రతి గ్రామంలో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి డిప్యూటీ స్పీకర్ నిర్మిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా గ్రామాలాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఏర్పడినా దాని పరిష్కారానికి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచేందుకు డిప్యూటీ స్పీకర్ నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. సర్పంచి చింతపల్లి వెంకటనారాయణ(చిన్న) నాయకులు పాల శ్రీను, జోగి వరలక్ష్మి, చింతపల్లి వెంకటేశ్వరరావు, రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం



మందులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ నాయకర్

గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగపర్చుకోవాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని యర్రంశెట్టివారి పాలెం గ్రామంలో పశువర్ధకశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన మెగా పశువైద్య శిబిరాన్ని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, సర్పంచి వైఎస్.నాగముత్యమాంబతో కలిసి ఆయన ప్రారంభించారు. అంతకు ముందు గ్రామ సెంటర్ నుంచి రైతులు ఏర్పాటు చేసిన ఎడ్ల బండిపై నేతలు ప్రదర్శనగా శిబిరం వద్దకు వచ్చారు. రైతులకు అందిస్తున్న సబ్సిడీలు, రాయితీలు, పథకాలపై అధికారుల నుంచి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ పశుసంవర్ధక సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక నిధులు కేటాయిస్తుందన్నారు. దీన్ని అధికారులు, సిబ్బంది గ్రామాల్లోని పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మినీ గోకులం షెడ్ నిర్మాణానికి ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో అందిస్తుందన్నారు. నియోజకవర్గం 44 షెడ్డులు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రైతులు వినియోగించుకోవాలన్నారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ పశువుల పట్ల రైతులు నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అధికారులు నిర్వహించే ఈ శిబిరాలు వినియోగించుకుని పాడి అభివృద్ధి సాధించాలన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామరాజు మాట్లాడుతూ పశువైద్య శిబిరం జరిగినప్పుడు, పశువుల యజమానులు తమ పశువులను తీసుకువెళ్లి వైద్యుల సలహాలు పాటించాలని, దీనివల్ల పశువుల మరణాల రేటు తగ్గి, పాల దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం వైద్యులు 900 పశువులకు గాలికుంటు వ్యాధి, నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, గర్భకోశ పరీక్షలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు. లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. వీటిలో గెలుపొందిన లేగ దూడల యజమానులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఆకన శ్రీదేవి, మాజీ ఎంపిసి ఉపాధ్యక్షులు యర్రంశెట్టి బాబులు, ఆకన చంద్రశేఖర్, యర్రంశెట్టి హరి, డాక్టర్ ఇంజేటి సురేంద్ర, నారాసాయి పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా రమణ రాజు, త్రిమూర్తులు

ప్రజాశక్తి - పాలకోడేరు



రమణరాజు, త్రిమూర్తులు

యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పివి.రమణ రాజు, కె.త్రిమూర్తులు, కోశాధికారి జి.విజయ్ కుమార్ రాజు మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాలకోడేరు మండల నూతన కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం హాజరయ్యారు. నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలతో పాటు కార్మిక కర్షక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ముఖ్యంగా యుటిఎఫ్ అభివృద్ధికి పాటుపడాలని దిశా నిర్దేశించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉపాధ్యాయ ఉద్యమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఎంఎల్‌సి గోపీమూర్తి ఘనంగా సత్కరించారు.

పోరాడితేనే సమస్యలు పరిష్కారం : సిపిఎం

వీరవాసరం : సిపిఎం చేసిన ఆందోళనలు, ధర్నాలు, పాదయాత్రల వల్లే నవుడూరు-కొండేపూడి ఆర్అండ్‌బి రోడ్డు వేశారని సిపిఎం నవుడూరు గ్రామ సెక్రెటరీ అయినంపూడి బాబురావు అన్నారు. శుక్రవారం నవుడూరు సిపిఎం శాఖ సమావేశం యాళ్లబండి నారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మండలంలో నెలకొన్న పలు సమస్యలను చర్చించారు. బాబురావు మాట్లాడుతూ రైతులకు ఎంతో ముఖ్యమైన నవుడూరు-మాముడూరు వెళ్లే రోడ్డు ధ్వంసమై ఏళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, తక్షణం వేసి ప్రమాదాలను నివారించాలని అన్నారు. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఇల్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించాలని డిమాండ్ చేశారు. లింగం సత్యనారాయణ, మైగాపుల త్రిమూర్తులు, రాము పాల్గొన్నారు.

గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలి : సిఐటియు

పెనుగొండ: మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రభుత్వ పాఠశాల ఆయాల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సిఐటియు ఆధ్వర్యాన పెనుగొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్‌కు వినతి పత్రం అందించినట్లు వివరించారు. వంట ఖర్చులు, ముడి సరుకుల కోసం చేసిన ఖర్చుల బిల్లులు నాలుగు నెలలుగా పెండింగ్లో ఉన్నాయని, వేతనాల బకాయిలు ఉన్నాయన్నారు. దీంతో కార్మికులు తమ సొంత డబ్బులు ఖర్చు చేసి వంట చేస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం సరఫరా చేసే కోడిగుడ్లలో చాలా కాలం చెల్లినవి, పగిలినవి ఉంటున్నాయని కార్మికులు చెబుతున్నారన్నారు. ఇటీవల స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రయివేటీకరణ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వ్యకాస నాయకులు ఎస్‌కె.పాదుషా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కోళ్ల విజయలక్ష్మి, వెలిచేటి శ్రీలక్ష్మి, జె.భవాని, పాఠశాల ఆయాలు యాగాటి దుర్గ, వి.అరుణ పాల్గొన్నారు.

నేడు విద్యార్థుల ప్రాజెక్ట్స్ ప్రదర్శన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని వెలగలేరుకు చెందిన ప్రముఖ ప్రయివేట్ విద్యాసంస్థ విద్యార్థి ఇంగ్లీష్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్ట్స్ ప్రదర్శనని ఈనెల 20 శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహిస్తున్నట్టు సంస్థ కరస్పాండెంట్ పాడాల వెంకట రెడ్డి ఇక్కడ తెలిపారు. మార్టేరులోని రెడ్డి కల్యాణ మండపం ప్రాంగణంలో విద్యార్థులు రూపొందిన సైన్స్, మాథ్స్, రోబోటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సోషల్, ఇంగ్లీష్, కంప్యూటర్ కోడింగ్ స్కిల్స్ అంశాలపై సుమారు 400 ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్స్ ప్రదర్శనలో ఉంటాయన్నారు. ఈ ప్రదర్శనను మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ముఖ్య అతిధిగా పాల్గొని, ప్రారంభిస్తారని తెలిపారు.

బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన

పాలకోడేరు : బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహ దురాచారాన్ని రూపుమాపాలని భీమవరం 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి అన్నారు. శృంగవృక్షం సచివాలయం వద్ద శుక్రవారం బాల్య వివాహ నిషేధ చట్టంపై మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యాన నిర్వహించారు. ప్యానల్ న్యాయవాదులు ఎస్.సుధీర్, బి.సురేష్ కుమార్, ఎంబి.భవాని, శేషనాయుడు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డి.శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయం మిషన్ వాత్సల్య వారి ఆధ్వర్యాన బాల వివాహ ముక్త్ భారత్ 100 రోజుల కాంపెయిన్ నిర్వహించారు. మండలంలోని ఆగర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ నిషేధ చట్టం పై అవగాహన కార్యక్రమం శుక్రవారం విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థాగత సేవల రక్షణ అధికారి పి.మమతశ్రీ విద్యార్థులకు బాల్యవివాహ నిషేధ చట్టం-2006పై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచి ఎస్.మురళీకృష్ణ రాజు, సెక్రటరీ వై.సుధారాణి, విఆర్ఒ టి.శ్రీనివాసరావు, స్కూల్ మాస్టారు జివివిఆర్ గిరిబాబు పాల్గొన్నారు.

మస్కట్‌లో మహిళ ఆత్మహత్య

మృతదేహాన్ని ఉండికి చేర్చిన నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్

ఉండి: ఉండి పెద్దపేటకు చెందిన తోకల సోని(24) జీవనోపాధి నిమిత్తం 6 నెలల క్రితం మస్కట్ వెళ్లగా పని ఒత్తిడి కారణంగా వారం రోజుల క్రితం పని చేసే ఇంట్లోనే ఆమె ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మస్కట్ నుంచి ఉండిలోని ఆమె తల్లిదండ్రులకు సమాచారం రావడంతో వెంటనే వారు నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ భీమవరం కోఆర్డినేటర్ కనుమూరి విజయదుర్గను సంప్రదించగా ఆమె ద్వారా ట్రస్ట్ స్టేట్ కోఆర్డినేటర్ రవిని సంప్రదించి మస్కట్లో ఇండియన్ ఎంబసి వాలంటీర్‌గా పనిచేస్తున్న రాజేశ్వరి ద్వారా సోని మృతదేహాన్ని ఇండియాకు రప్పించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఉండిలోని ఆమె ఇంటి వరకు ఎపి ఎన్‌ఆర్‌టిఎస్ ద్వారా అంబులెన్స్‌ని ఏర్పాటు చేసి ఆమె మృతదేహాన్ని ఉండి గ్రామానికి చేర్చారు. ఆమె భర్త అబ్రహం జీవనోపాధి నిమిత్తం దుబాయిలో ఉంటున్నట్లు వారు తెలిపారు. సోనీ మృతదేహాన్ని చనిపోయిన వారం రోజులకే ఉండి గ్రామానికి చేర్పించడంలో సహకరించిన ట్రస్ట్‌కు, కనుమూరి విజయదుర్గకు, ఖర్చులు భరించిన భారత ప్రభుత్వానికి స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

మానవ అక్రమ రవాణా నిరోధించాలి : ఎంపిడిఒ

ఆచంట : మనుషుల అక్రమ రవాణాపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ మనుషుల అక్రమ రవాణాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా ఉందన్నారు. ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీనికి గురవుతున్నారని, ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహనా కలిగి ఉండాలని, ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని అన్నారు. ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికి అవగాహన కల్పించి రక్షించాలని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.